క్లుప్తంగా

నేడు కోటసత్తెమ్మ ఆలయం మూసివేత

నిడదవోలు రూరల్: పాక్షిక చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయాన్ని ఈనెల 28వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) శుక్రవారం తెలిపారు. ఈనెల 29న ఆదివారం ఉదయం ఏడు గంటలకు అమ్మవారి ఆలయ ద్వారాలను తెరిచి సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

చురుగ్గా సెంట్రల్ లైటింగ్ పనులు


ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులు

దేవరపల్లి: 'రుడా' నిధులు రూ.65 లక్షల వ్యయంతో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సారథ్యంలో దేవరపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వినాయక ఆలయం వరకు, మూడు రోడ్ల కూడలి నుంచి గోపాలపురం రోడ్డులోని పొగాకు బోర్డు వరకూ సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోడ్ల కూడలి, బస్టాండ్ వద్ద రెండు టవర్లు ఏర్పాటు చేసి హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో పనులు పూర్తవుతాయని సంబంధిత అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు పూజిత



నిడదవోలు రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు నిడదవోలుకు చెందిన శశి ఇంటర్ ఫస్టియర్ విద్యార్థిని ననుబోలు పూజిత ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ బి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. అండర్-17 విభాగంలో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ పోటీల్లో పూజిత ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందన్నారు.

మేనేజర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లజర్ల: నల్లజర్లలో మహిళా మార్ట్‌లో మేనేజర్‌గా విధులు నిర్వర్తించడానికి ఎంబీఏ చదివి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన యువతీ,యువకులు దరఖాస్తు చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం మండల ఏపీఎం కె.విజయ నిర్మలకుమారి తెలిపారు. జీతం రూ.15 వేలు ఉంటుందన్నారు. అర్హతలు ఉన్న అభ్యర్థులు తమ కార్యాలయ పని వేళల్లో స్వయంగా వచ్చి దరఖాస్తులు అందించవచ్చన్నారు.

ఇరు వర్గాలపై కేసుల నమోదు

నిడదవోలు రూరల్: తనను ప్రేమించమంటూ వేధిస్తున్న మండలంలోని కోరుమామిడికి చెందిన యువకుడు వెంపరావు రాముపై అదే గ్రామానికి చెందిన యువతి సమిశ్రగూడెం పోలీసుకు ఫిర్యాదు చేసింది. దీంతో రాముపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై సుభానీ శనివారం తెలిపారు. ఇదే ఘటనలో రాముపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేయడంతో గాయాలై చికిత్స పొందుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై మరో కేసులో నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురోగతిని వివరించండి


హాజరైన వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ శ్రేణులు, సర్పచులు, ఎంపీటీసీలు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం
- 'వై ఏపీ నీడ్స్ జగన్' పై అవగాహన సదస్సు

పెరవలి: రాష్ట్రాభివృద్ధికి భవిష్యత్తులోనూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరం ఎంతో ఉందని నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' అనే కార్యక్రమంపై శుక్రవారం వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండలంలోని కాపవరంలోని దీపికా కన్వెన్షన్ హాల్లో ఈ సదస్సు జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలో వివరించే డాక్యుమెంటరీ చిత్రాన్ని తెరపై ప్రదర్శించారు. గత నాలుగున్నరేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏమేం అభివృద్ధి పనులు చేశారు? ప్రతిపక్షాలు ఎంత బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిందనే విషయాలు ఈ లఘు చిత్రంలో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు గత నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో జరిగిన అభివృద్ధిని, పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ మంచి పనులు చేపట్టినా, కోర్టుల్లో కేసులు వేసి వాటిని అడ్డుకోవడమే లక్ష్యంగా ఇంతకాలం విపక్షాలు పనిచేశాయన్నారు. ప్రస్తుతం నిడదవోలు టీడీపీ టికెట్ కోసం పోటీపడుతున్న ఇద్దరు నేతలూ ఇసుక దొంగలే అని ఎమ్మెల్యే విమర్శించారు.

నవంబర్ 9 నుంచి కార్యక్రమం

నవంబర్ 9 నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు చెప్పారు. ఇందులో భాగంగా వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఇప్పటి వరకూ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీర్ల రాధయ్య, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి మండలి డైరెక్టర్ దొడ్డిగర్ల స్వాతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, గృహ సారథుల మండల కన్వీనర్ రామదుగుల సూర్యనారాయణ, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షుడు పొట్టి రాంబాబు, జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మీనానగరంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి తానేటి వనిత

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- మీనానగరం, కానూరు గ్రామాల్లో గడప గడపకూ..

చాగల్లు: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. చాగల్లు-5 సచివాలయం పరిధిలోని మీనానగరంలో శుక్రవారం ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఏ గడపకు వెళ్లినా చిరునవ్వుతో ప్రజలు తమని ఆహ్వానిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, వైస్ ఎంపీపీ జుజ్జువరపు రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, మండల గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, గారపాటి శ్రీనివాసరావు, చాగల్లు సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకా రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా..

పెరవలి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకోసమే ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని కానూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా కానూరు గ్రామ ప్రజలకు రూ. 35 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. టీడీపీ, జనసేనల మాదిరిగా ఒకటి చెప్పి మరొకటి చేయబోమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీమండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కొమ్మిశెట్టి రాము, తోట సురేష్, అంబటి బ్రహ్మయ్య, కరుటూరి గోపి తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలును అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- మల వ్యర్థ శుద్ధీకరణ ప్లాంట్‌కు శంకుస్థాపన


మల వ్యర్థ శుద్ధీకరణ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి భవిష్యత్తులో నిడదవోలును మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని కంపోస్టు యార్డు వద్ద మల వ్యర్థ శుద్ధీకరణ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. స్వచ్ఛ ఆంధ్ర భారత్ కార్పొరేషన్ నిధులు రూ. 2.05 కోట్ల వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మిస్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జనను పూర్తిగా నిర్మూలించే ఉద్దేశంతో ఈ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ) నిర్మాణం చేపడుతున్నామన్నారు. పట్టణంలో సెప్టిక్ ట్యాంకుల నుంచి తీసే మల వ్యర్థాలను ఈ ప్లాంట్‌కు తరలించి ఇక్కడి అండర్ గ్రాండ్ ట్యాంకులో డంప్ చేస్తారని తెలిపారు. అనంతరం శుద్ధీకరణ ద్వారా సాలిడ్, లిక్విడ్‌లను వేరు చేసి సాలిడ్‌ను మాత్రం బుడిద చేస్తారన్నారు. ఇప్పటి వరకూ సుమారు రూ.10 కోట్ల వ్యయంతో పట్టణంలో డ్రైన్‌లు, రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. మరిన్ని అభివృద్ధి పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, డీఈ మాధవీలత, ఏఈ హేమంత్‌కుమార్ వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కార్యదర్శి గాజుల రంగారావు, జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, ఎండీ షకీరాబేగం, గుర్రం శాంతిశ్రీ , పాల్గొన్నారు.

అమ్మవారి ఊరేగింపు వేలం రూ.1.80 లక్షలు


దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్లో సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి విగ్రహం

దేవరపల్లి: దసరా మహోత్సవాల సందర్భంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్లో ప్రతిష్ఠించిన సౌభాగ్య దుర్గాంబిక అమ్మవారి విగ్రహాన్ని గ్రామ వీధుల్లో రథంపై ఊరేగించడానికి ఆలయ కమిటీ గురువారం రాత్రి ఆలయం వద్ద వేలం నిర్వహించింది. ఈ విగ్రహాన్ని వేలంలో తంగెళ్ల బ్రదర్స్ సుబ్రహ్మణ్యం, రవికుమార్, గంగాధర్‌లు రూ.1.80 కు దక్కించుకున్నారు. తంగెళ్ల బ్రదర్స్, కవల నాగేశ్వరరావు, అడపా రామాంజనేయులు వేలంలో పాల్గొని చివరి వరకు పోటీపడ్డారు. నవంబరు 2న అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన అష్టలక్ష్మి వాహనంపై గ్రామంలో ఊరేగించి నిమజ్జనం చేస్తారని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఐదు నెలల బాలుడికి నోబుల్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్

460 రకాల వస్తువులను గుర్తించిన వైనం


నోబుల్ వరల్డ్ రికార్డు సాధించిన చిన్నారి మౌర్యతో తల్లిదండ్రులు దిలీప్, రాణి

నల్లజర్ల: మండలంలోని ఘంటావారిగూడేనికి చెందిన ఐదు నెలల చిన్నారికి నోబుల్ వరల్డ్ రికార్డు పురస్కారం లభించింది. వైద్య, ఆరోగ్యశాఖలో మండలంలోని పుల్లలపాడులో ఏఎన్ఎంగా పనిచేస్తున్న వీరాబత్తిన రాణి, ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి అయిన దిలీప్ దంపతుల కుమారుడు మౌర్య. రెండు, మూడు నెలల వయసు నుంచే అతడు వస్తువులను గుర్తించడం మొదలు పెట్టాడు. అతడి జ్ఞాపకశక్తిని గుర్తించిన తల్లి రాణి ఇంట్లోని ఆట వస్తువులు, బొమ్మలను చూపిస్తూ వచ్చింది. ఏ బొమ్మ చూపించినా మౌర్య ఇట్టే పసిగట్టే వాడు. ఆన్‌లైన్‌లో ఆర్డరు పెట్టి తెప్పించిన బొమ్మలన్నింటినీ మౌర్య 15 రోజులలోనే గుర్తించాడు. మొత్తం 460 రకాల వస్తువులను ఆ బాలుడు గుర్తించాడు. దీంతో తల్లి రాణి నోబుల్ వరల్డ్ రికార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఆ సంస్థ వీడియో కాల్ ద్వారా ఈ పిల్లాడి మెమరీని గుర్తించారు. అక్టోబరు 10న నోబుల్ వరల్డ్ రికార్డు సంస్థ కొరియర్ ద్వారా ఈ పురస్కారం, మెడల్ అందించింది.అంతేకాకుండా ఇంటర్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుకు దరఖాస్తు చేసినట్టు రాణి చెప్పారు.

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

- అజెండాలోని 6,7,8 అంశాల రద్దు
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు మునిసిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. 15వ ఆర్థిక సంఘం మొదటి విడత టైడ్ అండ్ అన్‌టైడ్ నిధులు రూ.49.70 లక్షలతో 4,14, 18 వార్డుల్లో సిమెంటు రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు చేపట్టాలని తీర్మానించారు. ఐదో వార్డులో కల్వర్టు మరమ్మతులకు, నాలుగో వార్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద గ్రావెల్‌లో రోడ్డు బెర్ములు ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పారిశుధ్య, ప్రజారోగ్య విభాగాల ఖర్చులకు గాను రూ.10 లక్షలు కేటాయించాలని ప్రతిపాదించిన అజెండాలోని 6,7,8 అంశాలను రద్దు చేశారు. డంపింగ్ యార్డు కోసం గతంలో సేకరించిన భూమి లోతట్టుగా ఉన్నందున రైతు అభ్యర్థన మేరకు తిరిగి ఆయనకు అప్పగించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.18వ వార్డులో మదర్ థెరిసా హోమ్‌కి వెళ్లే రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించారు. పలువురు సభ్యులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ఆమోదం తెలిపారు. తారు రోడ్డుగా ప్రభుత్వాసుపత్రి రోడ్డు అభివృద్ధికి రూ.20 లక్షలు కేటాయించారు. శ్రీనివాసపురంలోని రావణబ్రహ్మ శివాలయం వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించాలని తీర్మానం చేశారు. పదో వార్డులో సీసీ డ్రెన్‌లు నిర్మాణానికి, 11వ వార్డులో నూకాలమ్మ గుడి వీధిలో డ్రెయిన్ పూడిక తీతకు, ఆరో వార్డు మోహర్‌బాబా గుడి వీధిలో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 22వ వార్డులో మొక్క చింతల రామాలయం వెనుక వీధిలో పైప్‌లైన్ ఏర్పాటుకు, పురపాలక సంఘంలో ఒక టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు చేసే పనిని రూ.4 లక్షలతో చేపటేందుకు కౌన్సిల్ తీర్మానించారు. 21వ వార్డు అచ్చాయమ్మ కాలనీలో రూ.4 లక్షలతో సీసీ డ్రెయిన్, అదే కాలనీలో రూ.3.5 లక్షలతో మరో డ్రెయిన్ నిర్మాణానికి కౌన్సిల్ అంగీకరించింది. మూడో వార్డు క్రిస్టియన్ పేట, వాటర్ వర్క్స్ సమీపంలో రూ.5.5 లక్షల సీసీ డ్రెయిన్ నిర్మాణానికి కౌన్సిల్ తీర్మానించారు. 22వ వార్డు ఊబా వారి వీధిలో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. గోష్పాద క్షేత్రంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని చైర్ పర్సన్ రత్నకుమారి ప్రకటించారు.కమిషనర్ బి.శ్రీకాంత్, వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు


తాడిపర్రు ఊరేగింపులో కాళికాదేవి వేషాలు


వేలివెన్నులో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఊరేగింపు

ఉండ్రాజవరం: దసరా ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం మండలంలోని తాడిపర్రు, వేలివెన్ను గ్రామాల్లో అమ్మ వార్ల విగ్రమాల ఊరేగింపులు అట్టహసంగా నిర్వహించారు. బుట్టబొమ్మలు, కేరళ, తీన్మార్ డప్పు వాయిద్యాలు, వివిధ రకాల వేషధారణలతో సాగిన తాడిపర్రు అమ్మవారి ఊరేగింపు ఆకట్టుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై వేలివెన్నులో దుర్గమ్మ ప్రతిమను ఊరేగించారు. పలువురు భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

ఆక్షేపణల స్వీకరణకు డిసెంబర్ 9 వరకూ గడువు

కొవ్వూరు: ముసాయిదా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి అన్ని పోలింగ్ స్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాల వల్ల ప్రదర్శనకు ఉంచామని ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. ఈ జాబితాల్లో ఏదైనా ఆక్షేపణలు ఉంటే డిసెంబర్ 9వ తేదీలోగా తెలియజేయవచ్చని సూచించారు.జాబితాలో ఏదైనా మార్పు అవసరం ఉంటే తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలలో గానీ, పోలింగ్ కేంద్రం వద్ద పోస్టు ద్వారా గాని, నేరుగా గాని దరఖాస్తులు అందజేయాలన్నారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్ల వయస్సును చేరుకునే వారు కుడా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

పంట నమోదు వివరాలు సరిచూసుకోండి

తాళ్లపూడి: పంట నమోదు వివరాల నమోదు (ఈ క్రాప్) లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతులు గ్రీవెన్స్ రూపంలో ఆర్‌బీకేల్లో అందజేశాయని కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్ సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు వివరాల సామాజిక తనిఖీని శుక్రవారం మండలంలోని వేగేశ్వరపురం రైతు భరోసా కేంద్రం వద్ద ఆయన చేపట్టారు. ఇందుకోసం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. రైతులకు పంట నమోదు వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29 వరకూ ప్రతి ఆర్‌బీకే వద్దా సామాజిక తనిఖీల నిమిత్తం పంట నమోదు జాబితాలను ప్రదర్శించామన్నారు. కార్యక్రమంలో ఏవో జి.రుచిత, అగ్రికల్చర్ అసిస్టెంట్లు గౌతమి, పోశమ్మ, రైతులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికే 'సురక్ష'

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- ఆరు చోట్ల సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది మంది పేదలకు ఉన్నత వైద్యం


గోపాలపురం మండలం కరగపాడులో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


కంసాలిపాలెం శిబిరం వద్ద పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు సూచించారు. మండలంలోని కంసాలిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ప్రారంభించారు. అనంతరం వృద్ధులకు మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యుడు జి.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులు 538 మంది రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉప్పాటి వెంకటేష్, బెజవాడ గంగాధర్, కొయి శ్రీనివాస్, రాపోలు వెంకటేష్, కొయి చిన్నా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరగపాడులో 210 మందికి

గోపాలపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేదలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని కరగపాడు సచివాలయం వద్ద నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు 210 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హుకుంపేట, అన్నదేవరపేట పీహెచ్‌సీల వైద్యులు శిబిరంలో రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, సర్పంచ్ బొమ్మిన నాగలక్ష్మి, నాగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కె వల్లీ, మస్తాన్‌బాబా, దొడ్డిగర్ల రామారావు, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం

కరగపాడు పంచాయతీ పరిధిలో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. గ్రామంలో గడప గడపకూ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభించారు.

తెలికిచెర్లలో 612 మందికి ..

నల్లజర్ల: మండలంలోని పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెలికిచెర్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బండి చిన నాగరాజు (చిట్టి) ఉప సర్పంచ్ నక్కా నాగసత్యనారాయణ (పండు) ప్రారంభించారు. శిబిరంలో భార్గవి (గైనకాలజిస్ట్), ఋష్వరరావు (ఎండీ, జనరల్), పీహెచ్‌సీ డాక్టర్లు సిరాజుద్దీన్, రాజశేఖర్‌లు 612 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. వారిలో ఏడుగురిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం వద్ద ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ఆకట్టుకుంది. సీడీపీఓ వైబీ సుందరి, ఏసీడీపీఓ పద్మావతి, సూపర్‌వైజర్లు కృష్ణవేణి, హారతి, పీహెచ్ఎస్ ఇందిర పాల్గొన్నారు.

దుద్దుకూరులో 565 మందికి..

దేవరపల్లి: దుద్దుకూరు జెడ్పీ హైస్కూల్ వద్ద నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీపీ కేవీకే దుర్గారావు ప్రారంభించారు. ఇక్క ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల వార్డులను, ఐసీడీఎస్ స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కంటి పరీక్షలు చేయించుకున్న 73 మందికి ఎంపీపీ చేతుల మీదుగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు. దేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సాంబశివరావు మాట్లాడుతూ డాక్టర్లు కె.అభిషేక్, పి.తేజశ్విని, వై.సుజాత, సీహెచ్ హరిచందన్, శ్రీనివాస్‌లు 565 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వారిలో ముగ్గరిని ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్టు తెలిపారు. సర్పంచ్ బొంతా నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, డీఎల్‌డీఓ వి.శాంతామణి, సొసైటీ అధ్యక్షుడు కాండ్రు రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు సునీత, చంద్ర ల్గొన్నారు.

తాడిపర్రులో 615 మందికి..

ఉండ్రాజవరం: తాడిపర్రు ఉన్నత పాఠశాల్లో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఆర్.ఉషాదేవి (జనరల్ సర్జన్) ఆధ్వర్యంలో ఎస్‌జే ఇర్ఫాన్ (జనరల్ మెడిసిన్), విఘ్నేష్ (ఎండీ), సంతోష్ నిఖిలారెడ్డి (నేత్ర వైద్యురాలు) సుమారు 615 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి హాజరైన ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆమె రోగులకు మందులు పంపిణీ చేశారు. ఏర్పాట్లను తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో జీఆర్‌కే రాజు, సొసైటీ అధ్యక్షుడు అక్కిన రామకృష్ణ, సర్పంచ్ కరుటూరి నరేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

ఎస్.ముప్పవరంలో 505 మందికి..

చాగల్లు: మండలంలోని ఎస్.ముప్పవరం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో ప్రత్యేక వైద్యుల బృందం 505 మందికి సేవలు అందించారు. ఆర్థోపెడిక్, డెంటల్, జనరల్ అండ్ గైనిక్, ఆప్తమాలజీ విభాగల వైద్యులు రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అవసరమైన వారిని ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశారు. సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మడు, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు